

రోడ్డు పనులపై నివేదిక ఇవ్వండి

ప్రజాశక్తి-పాడేరు: -అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో కొండ శిఖర చిన్నకోనల తదితర గ్రామాల రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు సహకరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు పనులను అటవీశాఖాధికారులు ఆటంక పరుస్తున్నారంటూ గిరిజనుల నిరసన చేపట్టిన విషయమై వచ్చిన పత్రికా కథనాలపై కమిషన్ చైర్మన్ శంకరరావు స్పందించారు. అనంతగిరి మండలంలో నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి కొండ శిఖర గ్రామాలైన చిన్నకోనల, భూరిగా, వనిజతో పాటు ఎన్ఆర్ పురం పంచాయతీ పరిధి మరో ఐదు గ్రామాలకు రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసినప్పటికీ అటవీశాఖ అభ్యంతరం తెలుపుతోందంటూ చిన్నకోనల, వనిజ గ్రామాల వద్ద గిరిజనులు నిరసన ప్రదర్శనలు గతంలో చేపట్టారు. ఆయా రోడ్లకు నిధులు మంజూరు, తదనంతరం అటవీశాఖ అభ్యంతరాలపై కమిషన్‌కు నివేదిక సమర్పించాలని చైర్మన్ అధికారులకు ఆదేశించారు.

మహిళా సెక్యూరిటీ గార్డులను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: గురుకుల ఏకలవ్య పాఠశాలలు, ౦ కళాశాలలో పనిచేస్తున్న ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులను 2025 ఏప్రిల్ నుండి రెన్యువల్ చేసి మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, మహిళా సెక్యూరిటీ కార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకుల ఏకలవ్య పాఠశాలలు, కళాశాలల్లో ఎస్ఆర్ఆర్ టెండర్ సంస్థ ద్వారా నియమితులై 60 మంది ఆదివాసి మహిళలు సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారని, 2025 ఏప్రిల్ నుండి రెన్యువల్ చేసి కొనసాగించాలన్నారు. గత మూడు నెలల నుండి జీతభత్యాలు అందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బకాయి వేతనం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలకు 7,500 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని గురుకులం సొసైటీ నిబంధనల ప్రకారం 14 వేలు చెల్లించాలన్నారు. పాఠశాల, కళాశాలత గేటు వద్ద కనీస సౌకర్యం లేక ఎండ వాన చలికి లెక్క చేయకుండా తీవ్ర ఇబ్బందులు గురై విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కొన్ని పాఠశాలలు, కళాశాలలో సెక్యూరిటీ గార్డులతో అదనపు పనులు చేయించడంతో పని ఒత్తిడి గురవుతున్నారన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, యూనిఫాం, బూట్లు, టార్చిలైట్, లాఠీ రక్షణ పరికరాలు ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సెక్యూరిటీ గార్డుల సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంతి కుమారి,రాజేశ్వరి, ఈశ్వరమ్మ, కస్తూరి, సుభద్ర, రాజేశ్వరి పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న బాలదేవ్, సెక్యూరిటీ గార్డులు

రూ.456 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు

-ఉపాధి హామీలో జిల్లా అగ్రస్థానం
-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించి డోలీ మోతల రహితంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. . రూ.456 కోట్లతో రహదారులు అభివృద్ధి, కొత్త రోడ్లు నిర్మాణాలు, 26 వంతెనల నిర్మాణాలను మంజూరు చేయడం జరిగిందని స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి, ఉపాధికల్పన, మలేరియా నివారణ చర్యలు, ముందస్తు చర్యలను వివరించారు. 1కోటి 48 మందికి ఉపాది పనులు కల్పించడానికి లక్ష్యంగా నిర్దేశించి 1 కోటి 61 లక్షల మందికి పని కల్పించి ఉపాధి పనుల్లో జిల్లా అగ్రస్థానం లో నిలపడం జరిగిందన్నారు. రూ.737.32 కోట్ల కూలీలకు వేతనాలు చెల్లించడం జరిగిందన్నారు. ఉపాధి కూలీలకు రోజుకి రూ.300 లు నుండి రూ..307లు వేతనం పెంచడం జరిగిందన్నారు. రూ. 20 కోట్ల వ్యయంతో 104 చెక్ డ్యాం మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. ఈనెల 15 వ తేదీ నుండి 2086 గ్రామాలలో దోమల మందులు పిచికారీ పనులు ప్రారంభించడం జరుగు తుందన్నారు. జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో పూర్తి స్థాయిలో మందులు వినియోగించాలని చెప్పారు. 2030 నాటికి మలేరియా రహిత జిల్లాగా ప్రకటించడానికి ప్రణాళిలు తయారు చేసామన్నారు. ఈ ఏడాది 3 లక్షల 50 వేల దోమ తెరలు పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించడానికి రాష్ట్ర ముఖ్య మంత్రి ఆదేశించారన్నారు. ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో నీడి తోటలు పెంచడానికి అవసరమైన ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ వేసవి లో తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఉన్న మూడు ఐటిఏలలో టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసామని తాగునీటి సమస్యలపై సమాచారం అందిస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ప్రతి రోజు స్వయంగా పర్యవేక్షిస్తామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 1800 425 6828, పాడేరు ఐటిలో 08935250833, రంపచోడవరం ఐటిఏ 619004 252 123 చింతూరు ఐటిడి ఏ లో 81215 29228 సమాచార కేంద్రాల ఫోను నంబర్లకు సమాచారం అందిస్తే 24 గంటల్లో తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.
ఈనెల 7 వ తేదీన అరకువ్యాలీ డిగ్రీ కళాశాల మైదానంలో 18 వేల మంది విద్యార్థులతో 108 సూర్య నమస్కారాల యోగాసనాలు చేసి ప్రపంచ రికార్డు సాధించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఏ ఇంచార్జి పిఓ అభిషేక్ గౌడ, డ్వమా పిడి విద్యా సాగర్, యోగా గురు పతంజలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సంఘటనా స్థలంలో భోదేశ్వరరావు మృతదేహం, ద్విచక్ర వాహనం

ద్విచక్ర వాహనం బోల్తా పడి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-సీలేరు

ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జికె.వీధి మండలం లక్కవరపేట-దేవరపల్లి మార్గంలో చోటుచేసుకుంది. జికె.వీధి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ కోడిసింగి గ్రామానికి చెందిన కంకిపాటి భోదేశ్వరరావు (32) సొంత పనులపై బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి ఆయన ఇంటికి వెళ్తుండగా బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో లక్కవరపేట- దేవరాపల్లి రహదారి మధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో భోదేశ్వరరావు తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రమాదం జరిగిన తరువాత ఆ మార్గంలో ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాద సమాచారం వెంటనే తెలియరాలేదు. గురువారం ఉదయం ఆ రహదారిలో వెళు_న్న వ్యక్తులు ప్రమాదం జరిగినట్లు గుర్తించి వారి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు హుటా హుటీన సంఘటన స్థలానికి చేరుకొని జికె.వీధి పోలీసులకు తెలియజేశారు. సీఐ వరప్రసాద్, పోలీసు సిబ్బంది సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని బైకు బోల్తా కొట్టిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు అయింది. మృతదేహాన్ని చింతపల్లి సిహెచ్‌సికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ విలేకర్లతో మాట్లాడుతూ అతివేగంగా ద్విచక్ర వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. ప్రమాద స్థలానికి 40 మీటర్లు ముందు నుంచే వాహనం కంట్రోల్ తప్పి బోల్తా కొట్టిందని, దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న బోదేశ్వరరావు దూరంగా తూలిపోయి తలకు బలమైన గాయం కావడంతో సంఘటన ప్రదేశంలోనే మృతి చెందారని తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో భోదేశ్వరరావు అంత్యక్రియలు నిమిత్తం పోలీసుల నుండి కొంత ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. అలాగే అంత్యక్రియలు నిమిత్తం ఆర్థిక సహాయం చేయాలని దేవరపల్లి సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్‌కు, మాజీ ఎంపీటీసీ కంకిపాటి రామారావుకు సూచించినట్లు సిఐ వరప్రసాద్ పేర్కొన్నారు. కాగా బోదేశ్వరరావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి పాడేరు :మోదకొండమ్మ అమ్మవారు ఉత్సవాల సందర్భంగా 36 వ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా శాసన సభ్యులు మరియు ఆలయ కమిటీ చైర్మన్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు .మత్స్యరాస విశ్వేశ్వర రాజు, కలెక్టర్ డి దినేష్ కుమార్ రిబ్బన్ కట్ చేసి జాతీయ గీతం పాడి ఇరు జట్లు క్రీడాకారులతో పరిచయం చేసుకుంటూ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్‌లో 72 టీమ్ లు పాల్గొనున్నాయని, ప్రతి ఒక్క టీమ్ సభ్యులు ప్యాడ్స్ ,హెల్మెట్ వంటి పరికరాలు ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు, ఎటువంటి ఆటంకాలు కలగకుండా టోర్నమెంట్ నిర్వాహకులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు మొదటి విజేతలకు బహుమతి నగదు లక్ష ఇరవై వేల రూపాయలతో పాటు సీల్డ్, రెండవ విజేతలకు 60 వేల నగదుతో పాటు సీల్డ్.. అలాగే మరెన్నో బహుమతులు ప్రధానం చెయ్యనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీధరి మంగ్లన్న దొర,మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి సుబ్బారావు, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంత్, కూడా సురేష్ కుమార్,కెజియా రాణి, లకే రత్నబాయి, సర్పంచ్ లు గబ్బడ చిట్టి బాబు, నీలకంఠం, కుర్రబోయినా సన్నిబాబు, వంతాల రాంబాబు, మాజీ పి ఎ సి ఎస్ చైర్మన్ లకే రామ సత్యవతి,మాజీ సర్పంచ్ లు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన లారీ

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో సీతగుంట వై జంక్షన్ వద్ద మలుపు వద్ద లారీ నిలిచి పోయింది. హర్యానా నుండి జోలపుట్టు మీదుగా ఆంధ్రా చేరుకొని పెదబయలు మీదుగా ఒడిస్సా మార్గంలో లారీ వెళుతుండగా వై మలుపు వద్ద నిలిచి పోయింది. దీంతో బస్సులు, ప్రైవేటు వాహనాలు స్తంభించి పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు ప్రైవేటు వాహనదారుల సహకారంతో లారీని తీసి మార్గం సుగమం చేశారు.





మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనవాస విశ్వనాథ్

తాగునీటి సమస్య ఉంటే కార్యదర్శులపై చర్యలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ప్రస్తుత వేసవిలో మండలంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ హెచ్చరించారు. మండలంలో తాగునీటి సరఫరాపై మండల పరిషత్తు కార్యాలయం నుండి గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి బోర్లు పనిచేసేలా చూడాలని, పాడైన వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, ప్రజలకు తాగునీటి సమస్య ఉంటే 6300035669 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. తాగునీటి సమస్యపై పత్రికలలో ప్రచురించే వార్తాంశాలపై వెంటనే స్పందించి, వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నారాయణ, ఇఒపిఆర్‌డి విజయ్ కుమార్ పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

-సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి:మారుమూల గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు అన్నారు మండలంలోని కొత్తూరు పంచాయతీ కొండ శిఖరం గ్రామాలైనా. బూసిపాడు, కారుగండు, టెంకబుడిలను సందర్శించారు. అనంతరం గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం, మంచినీటి, పాఠశాల భవనం వంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 77 ఏళ్ళు గడుస్తున్నప్పటికీ కనీసం మౌలిక సదుపాయాలు ప్రభుత్వాలు కల్పించిన దాఖలు లేవన్నారు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కనీస రోడ్డు మార్గ సౌకర్యం లేక గర్భిణీలకు డోలి మోతలతో వైద్యం కోసం తరలించవలసి వస్తుందని తెలిపారు అంతేకాకుండా టెంకబుడ్డి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి మూడు లక్షల రూపాయలు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సార. సీతయ్య సిపిఎం నాయకులు పి. పోయు పి. మోసే గ్రామస్తులు గన్నెల. రోజా గన్నేల శ్రీను గణేష్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

కాఫీకిచ్చిన ప్రాధాన్యత జీడి పిక్కలకూ ఇవ్వండి

-ఐటిడిఎ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి
- గిరిజన సంఘం జిల్లా నాయకులు సూరిబాబు



రైతులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా నాయకులు సూరిబాబు

ప్రజాశక్తి-కొయ్యూరు : అంతర్జాతీయ మార్కెట్లో కాఫీకి ఎంత డిమాండ్ ఉందో జీడిపిక్కలకు కూడా అంతే డిమాండ్ ఉన్నప్పటికీ వాటిని పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు పేర్కొన్నారు. కొయ్యూరులో జీడి మామిడి రైతులతో గురువారం ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కలు పండిన సమయంలో పట్టించుకోకుండా ఉంటూ, పంట అయిపోయిన తరువాత తామే కొనుగోలు చేస్తామని ఐటిడిఎ అధికారులు ప్రగల్భాలు పలకడం తప్పా ఏనాడు కొనుగోలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. దీంతో జీడి మామిడి రైతులు ప్రతి సంవత్సరం దళారుల బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడిపిక్కలకు కొన్ని ప్రాంతాల్లో ధర బాగున్నప్పటికీ, కొయ్యూరు ప్రాంతంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి వారికి నచ్చిన ధర నిర్ణయించి అతి తక్కవ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. జీడిపిక్కల తూనికల్లోనూ కూడా పలు విధాలుగా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి జీడిపిక్కలపై దృష్టి సారించి రైతాంగానికి నష్టం లేకుండా ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సూరిబాబు డిమాండ్ చేశారు.

విడివికెలపై సందేహాలుంటే సంప్రదించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని వందన్ వికాస కేంద్రాల ద్వారా జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లుకు సరఫరాపై సందేహాలుంటే వెంటనే ఐటిడిఏను సంప్రదించాలని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విడివికెల అభివృద్ధి, వాటి ద్వారా కొనుగోలు చేసిన జీడి పిక్కలు ప్రాసెసింగ్‌కు యూనిట్లు ఏర్పాటు వంటి వాటిపై సందేహాలు ఉన్న వారు టోల్ ఫ్రీ నెంబర్ 08864- 2421135, 944801435 సంప్రదించాలని కోరారు.

ఎండ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రజలు ఎండ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బయటకు వెళ్ళినప్పుడు గొడుగు లేదా టోపీ పెట్టుకుని వెళ్లాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణుల ఇచ్చే సమాచారం మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉదయం 8 నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 తరువాత ఎండ తీవ్రత తగ్గిన తరువాత బయటకు రావాలని సూచించారు. ఎండ తీవ్రతను దష్టిలో పెట్టుకొని ఏజెన్సీలోని అన్ని సచివాలయాలు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాలలోనూ, ఉపాధి హామీ పనులు చేయుచున్న ప్రాంతాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఎవరికైనా ఎండ దెబ్బ తగిలిన వెంటనే చల్లని ప్రదేశంలో కూర్చోబెట్టిన అనంతరం ఆసుపత్రులకు తీసుకువెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎక్కడికక్కడ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు కార్నర్లు ఏర్పాటు చేయాలని ఎడియంహెచ్ఓ జి.శిరీషను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు.



కురుస్తున్న వర్షం

పాడేరులో వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఉక్కపోతకు గురైన ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురైయ్యారు. తొలుత కారు మబ్బులు కమ్ముకోవడంతో చీకటి వాతావరణం ఏర్పడింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మధ్యాహ్నం నాలుగున్నర గంటల తర్వాత వాన కురిసింది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. వర్షంతో సాయంత్రం ఆఫీసుల నుంచి వెళ్లే ఉద్యోగులు, కళాశాలల, పాఠశాలల నుంచి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు పంట పొలాల్లోని వర్షం నీరు వచ్చి చేరింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రాళ్లగెడ్డలో తాగునీటికి అవస్థలు

నిలిచిపోయిన జల్ జీవన్ మిషన్ పనులు
ఊట కుంట నీటినే తాగుతున్న వైనం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రాళ్లగెడ్డ గ్రామంలో మంచినీటి సమస్య రోజురోజుకి అధికమవుతుంది. తాగునీటి కోసం ఈ గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. గత రాష్ట్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీటి సౌకర్యానికి నిధులు మంజూరు చేసింది. అయితే రెండు సంవత్సరాల క్రితం నుంచి బోరు పనులు సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి చేయకపోవడంతో ప్రజలకు మంచినీటి సమస్య తీవ్రతరమైంది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు బోర్డర్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఊట నీరు వచ్చే విధంగా చిన్నపాటి కుంటను ఏర్పాటు చేసుకున్నారు. తాగునీటి సమస్య అధికం కావడంతో గ్రామ మహిళలందరూ ఆ ఊట కుంటలో మురుకు నీటిని తొలగించి పరిశుభ్రం చేసుకొని ఆ నీటిని తాగడానికి ఉపయోగిస్తున్నారు. మంచినీరు సేకరించుకోవటానికి ఇన్ని ఇబ్బందులు గురికావాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి జల్ జీవన్ మిషన్ బోరు పనులు పూర్తి చేసి మంచినీటి సౌకర్యం కల్పించాల కోరుతున్నారు. దీనిపై అధికార టిడిపి కూటమి నాయకులు చొరవ తీసుకొని అధికారులపై ఒత్తిడి తెచ్చి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఊట కుంటలో మురుగు నీరు తొలగిస్తున్న మహిళలు

ఫుడ్ కమిషన్ సభ్యుడు పర్యటన



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఫుడ్ కమిషన్ మెంబర్

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ మండలంలో గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు పర్యటించారు. మండలంలోని పద్మాపురం, ఎండపల్లి వలస, చొంపి అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు ఎండిఎం ద్వారా అందజేస్తున్న రేషన్ బియ్యంను పరిశీలించారు. తూకాల్లో ఎటువంటి మోసాలకు పాల్పడకుండా బియ్యం అందించాలని ఆయన సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యత ప్రమాణాలు లోపించకుండా చూడాలని ఆయన సూచించారు. నాణ్యతతో కూడిన భోజనం పెట్టడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన అన్నారు. నాణ్యమైన ఆహారం వండి పెట్టడంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అంగన్వాడీల మెనూ చార్జీలు పెంచాలని పలువురు ప్రస్తావించగా, ప్రతి నెల ఆహార భద్రత పథకం కమిషనర్ తో జరిగే సమావేశంలో మాట్లాడతామని, ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకొని వెళ్తామన్నారు. మెనూ సక్రమంగా అమలు జరపని శ్రీకాకుళం పార్వతీపురం జిల్లాల్లో ముగ్గురికి మెమోలు ఇచ్చినట్లు ఆయన అన్నారు. ఇకపై నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. అనంతరం అదే గ్రామంలోని జిపిఎస్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అరకులోయలోని హెూటల్స్‌లో నాణ్యమైన భోజనాలు పెట్టడం లేదని ప్రస్తావించగా ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి అటువంటి వారిపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆయన ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని న్యూ రాజస్థాన్ స్వీట్ షాప్ నిర్వాహకులపై ఇప్పటికి కేసు నమోదు చేసామని ఆయన అన్నారు. అరకు పర్యాటక కేంద్రం కావడంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి హెూటల్స్ తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ మండల తహసిల్దారు ప్రసాద్, ఎంఈఓ భారతరత్నం, సిడిపిఓ శారద, సూపర్వైజర్లు అరుణ శ్రీ,లక్ష్మి,ఏ టి డబ్ల్యూ ఓ మల్లికార్జున రావు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



మాట్లాడుతున్న శ్రీనివాసబాబు

ప్రజాశక్తి ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సమావేశంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస బాబు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. ప్రస్తుతం ఎక్కడా చూసినా కాలుష్యం, కల్తీ పెరిగిందన్నారు. దీనికి తోడు పంటలు పండించే రైతులు అధిక దిగుబడుకు రసాయనాలు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ, పాడేరు డివిజన్ లోని రైతులు అందరూ రసాయన ఎరువులు, రసాయన కీటక, నాశక మందులు విడిచిపెట్టి పంటలు పండించి నూరు శాతం ప్రకృతి వ్యవసాయం లక్ష్యం సాధించాలన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి సేవియర్ నందు, జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ భాస్కరరావు, ఏపీఎంఐపీ పిడి రహీమ్ ఆధ్వర్యలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.



ధారకొండలో కురుస్తున్న వర్షం

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండలో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. కొంత సమయం ఎండ, మరికొంత సమయం మబ్బులుతో కూడిన వాతావరణం నెలకొంది. గురువారం ఉదయం ఉష్ణోగ్రత ప్రభావం అధికంగా లేకపోవడంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగలేదు. వాతావరణంలో మార్పులతో పాటు భారీ వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కాఫీ బోర్డు అధికారిని కలిసిన రాజ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - మారేడుమిల్లి : కాఫీ బోర్డు అధికారి డి.సునీల్‌బాబును సెంటర్ ఫర్ ట్రైబల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి పల్లాల, సంస్థ సీఈఓ ఎస్.మణికంట గురువారం కలిశారు. మారేడుమిల్లి మండల పరిదిలో కాఫీ మొక్కల పెంపకం, నర్సరీ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. డివిజన్ పరిధిలోని సానుకూలంగా ఉన్న చోట రైతులకు అవగాహన కల్పించి, కాఫీ రీసెర్చ్ సెంటర్ కోసం చర్చించుకోవడం జరిగిందని తెలిపారు.

సహజ ప్రసవాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఏరియా ఆసుపత్రికి డెలివరీ నిమిత్తం వచ్చే మహిళలకు సహజ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారెడ్డి అన్నారు. ఏరియా ఆసుపత్రిలో సహజ ప్రసవాలపై గురువారం గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ సహజ ప్రసవాల వల్ల బిడ్డకు తల్లికి కూడా ఇన్ఫెక్షన్ ఉండదని, సిజేరియన్ రేట్ తగ్గించవచ్చని చెప్పారు. సహజ ప్రసవాలపై ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మోమినా పాల్గొన్నారు.

చీరలు, దుస్తుల పంపిణీ

రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో మారేడుమిల్లి మండలం బొడ్లంక, చావడి కోట, పంచాయతీల పరిధిలోని లోతట్లు గ్రామాల్లోనూ, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతానికి చెందిన గ్రామాల్లోనూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు 211 మందికి చీరలు, దుస్తులను రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామి రఘువీరానంద మహారాజ్ గురువారం పంపిణీ చేశారు. శారదమాత రాజమహేంద్రవరం వచ్చి 114 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సుమారు 1.30 లక్షలతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడ్లంక సర్పంచ్ సాదల ప్రేమ్ కుమార్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్ కుమార్‌రెడ్డి, వెదురునగరం టీవీకే స్కూల్ రిటైర్డు ఉపాధ్యయుడు పి.సాయి ఫణికుమార్, వాలంటీర్లు భగీరథ రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు. బొడ్లంకలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులకు రఘువీరానంద, సాయి ఫణి కుమార్, వివేకానందుని బోధనలు, ఏకాగ్రత సమయ పాలన, వ్యక్తిత్వ వికాసం గురుంచి తెలియజేశారు. విజయానికి మార్గం పుస్తకాలను అందచేశారు. వార్డెన్ గొర్లె నాగరత్నం పాల్గొన్నారు.

వాటర్ బెల్ కార్యక్రమం అమలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి నేపథ్యంలో వాటర్ బెల్స్ విధానాన్ని అమలు చేయడం జరుగుతుందని స్థానిక ఎంఈఓ-2 సూరారెడ్డి గురువారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు వీలుగా ఉదయం 10, 11, 12 గంటలకు ప్రతిరోజు విద్యార్థులు నీరు తాగేందుకు అవకాశం కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ మేరకు పాఠశాలల్లో జరిగే వాటర్ బెల్ కార్యక్రమాన్ని ఎంఈఓ గురువారం పర్యవేక్షించారు. సిబ్బందికి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ట్రైబల్ టూరిజం కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: గిరిజనుల భాగస్వామ్యంతో జిల్లా గిరిజన పర్యాటక కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా పర్యాటక కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల అభివృద్ధికి వీలుగా సమతా జడ్జిమెంట్ ప్రకారం డిటిడిఎఫ్ (డిస్ట్రిక్ట్ ట్రైబల్ డెవలప్మెంట్ ఫండ్) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు గల ప్రాంతాల అభివృద్ధికి పూర్తి నివేదిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. జిల్లాలో 1/70 చట్టం అమలులో ఉన్నందున గిరిజనేతరులు పెట్టుబడి పెట్టినప్పటికీ గిరిజనుల పేరుతోనే ప్రాజెక్ట్ ఉంటుందని, సర్వ హక్కులూ గిరిజనులకే ఉంటాయని వారు అప్పు తెచ్చుకొని లేదా గిరిజనేతరుల భాగస్వామ్యంతో ప్రాజెక్ట్ చేపట్టాలని స్పష్టం చేసారు. పర్యాటక ప్రాజెక్ట్ ల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత శాతం ఆ ప్రాంత, పరిసర ప్రాంతాల అభివృద్ధికి డిటిడిఎఫ్ ఉపయోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్ ఫాల్స్ ద్వారా ఆదాయం వస్తున్నప్పటికీ అది తాగు నీటికి వినియోగిస్తున్నందున నీరు కాలుష్యం కాకుండా పర్యాటకులకు కొన్ని ప్రాంతాలకు అనుమతించక పోవచ్చని, ఏ ప్రాంతాలకు అనుమతి ఉంది, ఏ ప్రాంతాలకు అనుమతి లేదు అన్న విషయం గుర్తించాల్సి ఉందన్నారు. కొత్త పర్యాటక కేంద్రాలు గుర్తించాలన్నారు. పర్యాటక ప్రాంతాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాజెక్టులకు గిరిజనులు ఎక్కడి నుండైనా డబ్బు సేకరించి పెట్టుబడి పెట్టవచ్చని, కానీ భూమి ఆ గిరిజనుడి పేరు మీదనే ఉండాలని బినామీలకు తావు లేదని, నిర్ణయాధికారం వారిదేనని స్పష్టం చేశారనెలలో ఒక రోజు పబ్లిక్ కన్వినియంట్ డే గా గుర్తించి పర్యాటకంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. జిల్లలో కనీసం ఐదు వేల హెూం స్టేలు గుర్తిస్తే 15 వేల బెడ్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. హెూం స్టేలు గుర్తింపును యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఎంపిడిఓలను ఆదేశించారు. ప్రతి పర్యాటక ప్రాంతాలలో కనీసం పది హెూం స్టేలు గుర్తించాలన్నారు. పిఎం జన్ మన్ కింద 40 వేలు గృహాలు మంజూరైనందున పాత గృహాలను హెూం స్టేలుగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెూం స్టేలు ఏర్పాటులో ఫర్నిచర్, కట్లరి, ఇతర హంగులు కల్పించడానికి నాలుగు నుండి ఐదు లక్షల రూపాయలు గ్రాంట్ వస్తుందని, గృహ యజమానులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రతి పర్యాటక కేంద్రాల వద్ద సమాచార కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్క్యూట్ టూరిజం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సైనేజ్ బోర్డులు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి జి. దాసు, జిల్లా అధికారులు, గిరిజన సంక్షేమ, ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికార్లులు, తహసిల్దార్లు పాల్గొనగా వర్చువల్ విధానంలో జేసి, ఐటిడిఎల పిఒలు, సబ్ కలెక్టర్లు, ఎపిటిడిసి బోర్డ్ డైరెక్టర్, డిఎం తదితరులు పాల్గొన్నారు.

శారద ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

500 మందికి వైద్య పరీక్షలు - మందుల పంపిణీ



రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని శారద నికేతన్ పాఠశాలలో శారద ట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణా మేటర్నటీ నర్సింగ్ హెూమ్, కృష్ణా చిల్డ్రన్స్ హాస్పటల్ (విశాఖపట్నం) సంయుక్తంగా బి ఎల్ నారాయణ, జనరల్ మేనేజింగ్ డైరెక్టర్ వరలక్ష్మి సహకారంతో గురువారం చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ మెడికల్ క్యాంపునకు విద్యార్థులు, గిరిజనులు సుమారు 500 పైగా హాజరయ్యారు. డాక్టర్లు బి తేజస్విని, దివ్య, పైల సంధ్య వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధులతో బాధపడుతున్న వారిని బిపి, షుగర్, గైనిక్ చెకప్, రక్తపరీక్ష చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి గిరిజన కుటుంబీలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి సుమారు లక్ష రూపాయలు వెచ్చించి ఖరీదైన మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా వేదిక నాయకురాలు జె రాజ్యలక్ష్మి, శారద ట్రస్ట్ సభ్యులు రత్నం, ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.జయ, శారదా నికేతన్ ప్రిన్సిపల్ చిరంజీవి, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమోన్మాదికి రిమాండ్

ప్రజాశక్తి -మధురవాడ : తాను ప్రేమించిన యువతినిచ్చి పెళ్లిచేయడంలేదనే ఆక్రోషంతో దాడికి పాల్పడిన ప్రేమోన్మాది నవీన్‌ను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ తెలిపారు.. పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొమ్మాది స్వయంకృషి నగర్‌లో బుధవారం లక్ష్మి అనే మహిళతోపాటు ఆమె కుమార్తెపై పాలకొండకు చెందిన నవీన్ దాడి చేసిన సంఘటన పాఠకులకు తెలిసిందే. ఈ దాడిలో లక్ష్మి మృతి చెందగా ఆమె కుమార్తె గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ప్రేమించిన యువతితో పెళ్లి కాలేదని నవీన్ దాడిచేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడు నవీన్‌ను నార్త్ జోన్ ఎసిపి అప్పలరాజు ఆధ్వర్యంలో సీఐ జి. బాలకృష్ణ బందం శ్రీకాకుళం జిల్లా బూర్జ సమీపంలో అదుపులోకి తీసుకుని, గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని సిఐ తెలిపారు.

సరుకు రవాణాలో ఈస్ట్ కోస్ట్ రైల్వే రికార్డు

259.254 మిలియన్ టన్నులతో దూసుకెళ్లిన వైనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024-25 ఆర్థిక సంవత్సరంలో 259.254 మిలియన్ టన్నుల సరుకు రవాణాను సాధించడం ద్వారా ఈస్ట్ కోస్ట్ రైల్వే సరికొత్త రికార్డు నెలకొల్పిందని రైల్వే అధికారులు గురువారం తెలిపారు మునుపటి రికార్డులను అధిగమించి 259 మిలియన్ టన్నుల మార్కును దాటి దేశంలోని మొదటి రైల్వే జోన్‌గా ఇసిఒఆర్ అవతరించిందని వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 3.034 మిలియన్ టన్నుల పెరుగుదల నమోదైందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 1.2 శాతం వృద్ధిని సూచిస్తోందని పేర్కొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే సరుకు రవాణా కార్యకలాపాలలో స్థిరంగా తన బలాన్ని నిరూపిస్తోందని తెలిపారు. వరుసగా ఆరో సంవత్సరం 200 మిలియన్ టన్నుల మార్కును దాటి చారిత్రాత్మక విజయాన్ని కొనసాగించిందని ఉద్ఘాటించారు. ఏడాది పొడవునా ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, జోన్ సమర్థత, వ్యూహాత్మక ప్రణాళిక, శ్రామిక శక్తి, అచెంచలమైన అంకితభావానికి నిదర్శనంగా ఈ రికార్డు నిలిచిందన్నారు. ఇసిఒఆర్‌లోని మూడు విభాగాలైన ఖుర్దా రోడ్, వాల్తేరు, సంబల్‌పూర్ అంకితభావంతో శ్రమించి గత ఏడాది గణాంకాలను అధిగమించి ఈ అద్భుతమైన ఫలితాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇసిఒఆర్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ సిబ్బంది, అధికారుల బృందానికి అభినందనలు తెలిపారు.

విశాఖ పోర్టులోకి అతిపెద్ద బాక్సైట్ నౌక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్టులోని వేదాంత అల్యూమినియం జనరల్ కార్గో బెర్త్ ప్రైవేట్ లిమిటెడ్ (విజిసిబి) భారతీయ నౌకాశ్రయ రంగంలో కొత్త మైలురాయిని చేరుకుంది. దేశంలోకి ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద బాక్సైట్ నౌకలలో ఒకటైన ఎంవి కెప్టెన్ లియోనిడాస్‌ను విజయవంతంగా బెర్త్ చేసింది. ఈ నౌక 1,99,500 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ను తీసుకువచ్చింది. ఇది పోర్ట్ కార్గో నిర్వహణ సామర్థ్యాన్ని తెలియజేస్తోంది. ఎంవి కెప్టెన్ లియోనిడాస్ విజయవంతంగా పోర్టుకు చేరడం విశాఖపట్నం పోర్టును అంతర్జాతీయ బాక్సైట్ వ్యాపారంలో ప్రధాన కేంద్రంగా మార్చడానికి తోడ్పడుతుందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఎంవి హువాహైన్ నౌక విజిసిబి టెర్మినల్‌కు విజయవంతంగా చేరింది. 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్ ఓర్‌ను అది డెలివరీ చేసింది. ఇది భారతదేశంలోని ఏ పోర్ట్‌కైనా వచ్చిన అతిపెద్ద సింగిల్ కార్గో షిప్‌మెంట్‌గా నిలిచింది.

ఈ సందర్భంగా విజిసిబి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ చిక్కాల సతీష్ కుమార్ మాట్లాడుతూ తాజా మైలురాయి తమకు గొప్ప గౌరవాన్ని కలిగించిందన్నారు. భారతదేశ నౌకాశ్రయ రంగానికి తమ సహకారాన్ని కొనసాగిస్తూ.. ఇంత భారీ కార్గోను కేవలం ఐదు రోజుల్లో దిగ్విజయంగా అన్‌లోడ్ చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నామన్నారు. ఇది తమ ఆపరేషనల్ ఎక్సలెన్స్‌కు నిదర్శనమన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరులో వంజరి అంజనేయులుకు చెందిన పూరిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. గురువారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సెర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి తాటాకుల ఇల్లు కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డులు, 10 బస్తాలు ధాన్యం, జీడి పిక్కలు రెండు బస్తాలు, రెండు తులాల బంగారం, రూ.50 వేలు నగదు, గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోతున్నాడు. విఆర్ఓ, సర్పంచ్ బాలరాజు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. నష్టపరిహారం అందే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు

పశువులకు నీటి తొట్టెలు ఎంతో ఉపయోగం



జడ్డంగిలో పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : గిరిజన పల్లెల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నీళ్ల తొట్టెలు పశువులకు ఎంతో ఉపయోగకరమని జడ్పిటిసి వడుగుల జ్యోతి, సర్పంచ్‌ల సమైక్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షులు గణజాల తాతారావ్ అన్నారు. మండలంలోని జడ్డంగి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ కింద నిర్మిస్తున్న పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులను జడ్పిటిసి వడుగుల జ్యోతి, కూటమి నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి కోసం అల్లాడే పశువుల దాహార్తిని తీర్చే విధంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రెడ్డి బాబు, కూటమి నేతలు గంగాధర్, భారంగి అనుదీప్, తెడ్ల రాంబాబు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు



పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ గ్రామంలో ఈనెల 7వ తేదీ సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో సభ ప్రాంగణ స్థలాన్ని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పరిశీలించారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన మండల అధికారుల బృందంతో కలిసి ముందుగా టోకూరు పంచాయతీ సచివాలయం ఆవరణంలో, భగ్మర వలస సభా ప్రగాఢ స్థలం, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అనంతరం బొర్రా పంచాయతీ పరిధి పూలగూడ గ్రామంలో సభా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించారు అనంతరం మండల కేంద్రంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవివి కుమార్, టోకూరు పంచాయతీ సర్పంచ్ కిల్లో మొస్య, అరకు డి ఇఇ రవికుమార్ పంచాయతీ సెక్రటరీ శైలజ తదితరులు పాల్గొన్నారు

గురుకులాల ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని గిరిజన గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ప్రవేశ పరీక్షను ఈ నెల 20న నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని గిరిజన గురుకుల విద్యాలయంలో లేదా 9493758072, 9490085781 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి



మెటీరియల్ అందజేస్తున్న డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లాలోని 73 ప్రభుత్వాసుపత్రుల్లో డెంగీ, మలేరియా జ్వరాలకు సంబంధించి అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. గురువారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో అన్నిసిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, పిహెచ్‌సిలకు పంపిణీ చేయాల్సిన డెంగీ, మలేరియా జ్వరాలకు రిజిస్టర్లు, చార్టులను ఆవిష్కరించి, సంబంధిత ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు.

ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, ఆయా రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి,డైలీ, వీక్లీ, మంత్లీ, యాన్యువల్ నివేదికలను ఎప్పటికప్పుడు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎంఓ చిత్రాడ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఒంటి పూట బడులు అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదౌతున్న నేపథ్యంలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో శత శాతం ఒంటి పూట బడులు పక్కగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఇప్పటికే కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధికారులకు ఆదేశాలు జారీ చేసారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 9, 10 తరగతులకు ప్రత్యేక తరగతుల పేరిట సాయంత్రం వేళల్లో పరోక్షంగా తరగతులు నిర్వహిస్తున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు.నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు

ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే చర్యలు

ప్రజాశక్తి - సీలేరు : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వ్యాపారులు వినియోగిస్తే భారీ జరిమానా తప్పదని జికె.వీధి ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండల కేంద్రం జీకే వీధిలో ప్లాస్టిక్ కవర్లు నిషేధంపై వ్యాపారులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రతి వ్యాపారీ జూట్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగం పూర్తిగా నిషేధానికి వ్యాపారులు అందరూ సహకరించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నిషేధం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్డి పాపారావు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు : ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు 11 అంకెలు గుర్తింపు సంఖ్య వస్తుందని జీకే వీధి తహశీల్దారు టి.రామకృష్ణ వెల్లడించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గురువారం విఆర్వోలు, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్లతో తహశీల్దారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతును ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో నమోదు చేసేందుకు వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు విధిగా బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన, ఆరోగ్య వంతమైన ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు పండించాలని సూచించారు. రీ సర్వే గ్రామాల్లో రైతులు విధిగా పాల్గొని సిబ్బందికి సహకరించాలని కోరారు. రైతులు మ్యుటేషన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ వంటి ఇన్పుట్ సబ్సిడీ పథకాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదన్, ఆర్ఐ మహదేవ్, మండల సర్వేయర్ శ్రీను పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ రాట మహోత్సవం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని గురువారం ముహూర్తపు రాట వేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గొర్ల వీర వెంకట్, గౌరవ అధ్యక్షురాలు ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, ముక్కల రమేష్, మహిళలు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 26 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. దాదాపు 15 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొనగా, 64 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో 26 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.వసుధ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమోన్మాది దాడి అమానుషం : గంటా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మధురవాడ స్వయంకృషినగర్‌లో ప్రేమోన్మాది దాడి సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉదయం ఆయన వెంకోజీపాలెం మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నక్కా దీపికను బిజెపి ఫ్లోర్ లీడర్, ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యులు విష్ణుకుమార్ రాజుతో కలిసి పరామర్శించారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పి, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను గంటా కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రేమోన్మాది దాడి అమానుషమైనదన్నారు. అతడిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.